# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 65
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
నవంబర్ 25, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## సంబురంగా సాహిత్యోత్సవం

- సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఘనంగా వేడుకలు
- హాజరైన సీపీ అంబర్ కిషోర్ ఝా, ఎమ్మెల్యే నాయిని
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వివరాలు2లో..

# పర్సంటేజీ ఇచ్చుకో.. బిల్లు పుచ్చుకో

## కార్పొరేషన్ లో కమీషన్ల లొల్లి

- మేయర్ కనుసన్నల్లోనే పంపకాలు
- ఇచ్చిన వారి బిల్లులకే ఓకే..
- లేదంటే ఎంబీ వెనక్కి
- తీవ్ర నిరాశలో గుత్తేదార్లు
- పట్టించుకోని కమిషనర్, కలెక్టర్

వరంగల్ మహా నగర పాలక సంస్థలో కమీషన్ల లొల్లి కొనసాగుతోంది. పర్సంటేజీలు ఇచ్చుకో..బిల్లు పుచ్చుకో అన్నట్లుగా మారింది బల్దియాలో పరిస్థితి. పాత బకాయిల చెల్లింపులకోసం ప్రభుత్వం రూ.187 కోట్ల నిధులు విడుదల చేయడంలో కమీషన్ల లొల్లి మరోమారు తెరమీదికి వచ్చింది. బల్దియా పరిధిలో గత కొంత కాలంగా రూ.60 నుంచి రూ.70 కోట్ల పెండింగ్ బిల్లులున్నాయి. నిబంధనల మేరకు పాత బిల్లులకు నిధులు మంజూరు చేసిన తర్వాత కొత్త పనులను ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే నిబంధనలకు పాతరేసి బిల్లులు మంజూరు కావాలంటే కోరినంత ఇచ్చుకోవాలంటూ కొత్త వాదనను తెరమీదికి తెచ్చారు. దీంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా గుత్తేదార్ల పరిస్థితి మారింది. ఇప్పటికే పనులు పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నందున తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక సతమతమవుతుంటే బిల్లుల చెల్లింపు సమయంలో మరోమారు పర్సంటేజీలు చెల్లించాలంటూ కొత్తగా నిబంధన విధించడాన్ని కాంట్రాక్టర్లు తప్పుబడుతున్నారు. పనులు చేసిన సమయంలోనే పర్సంటేజీలు ఇచ్చుకున్నందున ఇప్పుడు కొత్తగా పర్సంటేజీలు ఇచ్చుకోలేమని తేల్చి చెబుతున్నారు. అయితే పర్సంటేజీలు చెల్లించిన వారికే బిల్లులు చెల్లిస్తామంటూ బల్దియా ఇంజనీరింగ్ అధికారులు తేల్చి చెప్పడంతో పాటు ఏదైనా ఉంటే 'మేడమ్' తో మాట్లాడుకోవాలంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. ఈ విషయంలో కమిషనర్, కలెక్టర్ స్పందించి పెండింగ్ బిల్లుల చెల్లింపులో కమీషన్ల లొల్లి లేకుండా చూడాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి




2లో..

## ఇది కేసీఆర్ దళం

- తాటాకు చప్పుళ్లకు భయపడం
- మొదటి అడుగు మానుకోటలో..
- 119 నియోజకవర్గాల్లో ధర్నా చేస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


2లో..

## ప్రైవేట్ హాస్పిటల్స్ లో వసతులు కరువు

- నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ కు డీవైఎఫ్ఐ వినతి

## రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నాం

- మంత్రి కొండా సురేఖ
- రేపు జాతీయ న్యాయ దినోత్సవం



రాజ్యాంగంలో పొందుపరిచిన నిబంధనల కన్నా పాలకుల స్వీయ నైతికతే మన దేశ భవిష్యత్తును నిర్దేశిస్తుందని చెప్పిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ మాటలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అంతఃకరణశుద్ధితో ఆచరిస్తున్నదని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం (జాతీయ న్యాయ దినోత్సవం) సందర్భంగా రాజ్యాంగం రూపకల్పనకు సుదీర్ఘకాలం శ్రమించిన మేధావుల కృషిని మంత్రి సురేఖ స్మరించుకున్నారు. భారత రాజ్యాంగానికి ఆమోదం లభించిన నవంబర్ 26 భారతదేశ ప్రజలందరికీ ఎంతో ప్రత్యేకమైనదని మంత్రి అన్నారు. – వరంగల్ వాయిస్, వరంగల్

# పర్సంటేజీ ఇచ్చుకో.. బిల్లు పుచ్చుకో

- కార్పొరేషన్ లో కమీషన్ల లొల్లి
- మేయర్ కనుసన్నల్లోనే పంపకాలు
- ఇచ్చిన వారి బిల్లులకే ఓకే..
- లేదంటే ఎంబీ వెనక్కి
- తీవ్ర నిరాశలో గుత్తేదార్లు
- పట్టించుకోని కమిషనర్, కలెక్టర్



**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో ఇప్పటికే పనులు పూర్తయి బిల్లులకోసం ఎదురు చూస్తున్న వారికి చెల్లింపులతోపాటు టెండర్లు, ఒప్పందాలు పూర్తయి ప్రారంభం కాని పనులను వెంటనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.187 కోట్ల నిధులను విడుదల చేసింది. బల్దియాలో గత కొంత కాలంగా సుమారు రూ.70 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో పెండింగ్ బిల్లులకోసం గుత్తేదార్లు పలుమార్లు నిరసన కార్యక్రమాలను కూడా చేపట్టారు. బిల్లులు చెల్లిస్తేనే పనులు చేస్తామంటూ కాంట్రాక్టర్లు కొంత కాలం పనులను సైతం నిలిపివేశారు. అయితే కమిషనర్ కాంట్రాక్టర్లను ఒప్పించి పలు పనులు సాఫీగా జరిగేందుకు కృషి చేశారు. అయితే గతంతో ప్రభుత్వం కొన్ని నిధులు మంజూరు చేసినా వాటిని తమ కనుసన్నల్లో ఉన్న వారికే మంజూరు చేసి మిగిలిన వారిని పెండింగ్ లో పెట్టారన్న ఆరోపణలున్నాయి.

### చెప్పినంత ఇచ్చుకో..

తాము పనులు పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు చెల్లింపులో మాత్రం అన్యాయం జరుగుతోందని పలువురు గుత్తేదార్లు ఆరోపిస్తున్నారు. క్రమ పద్దతిలో అందరికంటే ముందున్నా ఆమ్యామ్యాలు చెల్లించకుంటే బిల్లులు పాసయ్యే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ లో నియంత పాలన కొనసాగుతోందంటూ ఆరోపిస్తున్నారు. అనుచరుల ద్వారా అందిన కాడికి దోచుకుంటున్నారంటున్నారు. బల్దియాలో పర్సంటేజీలు ఇచ్చి బిల్లులు పొందండి అనే స్థాయికి దిగజారిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తమకేమి మిగులుతుంది..

పనులు ప్రారంభంలోనే మేయర్, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఇంజినీరింగ్ అధికారులకు పర్సంటేజీలు ఇచ్చుకున్నందున బిల్లుల చెల్లింపు సమయంలో వారికి మరోమారు పర్సంటేజి ఇవ్వడం సాధ్యం కాదని గుత్తేదార్లు అంటున్నారు. ఒక్కో పనికి రెండు సార్లు పర్సంటేజీలు ఇస్తే తమకేమి మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ లో ఉన్న సుమారు రూ.70 కోట్ల పనులకు నాలుగు నుంచి ఐదు శాతం పర్సంటేజీ ఇవ్వాలంటూ బల్దియా ఇంజినీరింగ్ అధికారులు తేల్చి చెప్పడం ఆందోళన కలిగిస్తోందంటున్నారు. ఏదైనా ఉంటే 'మేడమ్' తో మాట్లాడుకోవాలంటూ ఉచిత సలహా ఇవ్వడాన్ని కాంట్రాక్టర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. చేసిన పనులకే బిల్లులు చెల్లించమంటే సంవత్సరాలుగా పెండింగ్ లో పెట్టిన అధికారులు నిధులు విడుదలైనా పర్సంటేజీలకోసం పెండింగ్ పెట్టడం సరికాదంటున్నారు. ఇలా అయితే చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందంటున్నారు.

### మిత్తీలు కట్టలేక..

గ్రేటర్ వరంగల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు పూర్తి చేసి సంవత్సరాలు కావస్తున్నా బిల్లులు మాత్రం చెల్లిచండం లేదని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. త్వరగా పనులు పూర్తి చేస్తే బిల్లులు త్వరగానే వస్తాయన్న ఆశతో పనులు చేస్తే బిల్లులు చెల్లించేందుకు ఇంజినీరింగ్ అధికారులు సతాయిస్తున్నారంటున్నారు. అప్పులు తెచ్చి పనులు పూర్తి చేస్తే బిల్లులు మంజూరు కాకపోవడంతో తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక రోడ్డుపాలు కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయంటున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, కమిషనర్ స్పందించాలని వేడుకుంటున్నారు. లేకుంటే చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయంటున్నారు. పర్సంటేజీలకోసం కక్కుర్తి పడే వారిపై ఏసీబీ అధికారులు ఉక్కుపాదం మోపాలంటున్నారు.



## జర్నలిస్ట్ సాగర్ ఆరోగ్య పరిస్థితి విషమం

**పరామర్శించిన జర్నలిస్ట్ ప్రతినిధులు**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సీనియర్ జర్నలిస్ట్ ఆడెపు సాగర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సాగర్ ను సోమవారం ఆర్ఐసీయూ వార్డులోకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన వెంటిలేషన్ పైనే ఉన్నట్లు డాక్టర్లు వివరించారు. ఆరోగ్యం తీవ్రంగా క్షీణించినట్లు వారు వెల్లడించారు. సాగర్ ను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, నయీం, వేణు, భరత్, ఐజేయూ జిల్లా సెక్రటరీ మట్టా దుర్గా ప్రసాద్, సీనియర్ జర్నలిస్టు మధు, యుగంధర్, చైతన్య, నాగరాజు తదితరులు ఎంజీఎంలో పరామర్శించారు. వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ కూడా సాగర్ ను పరామర్శించి త్వరగా కోలుకోవాలన్నారు. కాగా ఎన్ని ప్రభుత్వాలు, యూనియన్లు మారినా జర్నలిస్టుల స్థితి గతులు మారడం లేదని పలువురు జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే జర్నలిస్టుల జీవితాలను లెక్క చేయని, తూర్పు ప్రజా ప్రతినిదుల విజ్ఞతకే వదిలేస్తున్నాం..

## ప్రైవేట్ హాస్పిటల్స్ లో వసతులు కరువు

- నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ కు డీవైఎఫ్ఐ వినతి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ నిబంధనలు పాటించని హనుమకొండ నగరంలోని ప్రైవేటు హాస్పిటల్స్ పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జిల్లా కార్యదర్శి తిరుపతి, అధ్యక్షులు కిషోర్, సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రీవెన్స్ లో కలెక్టర్ పి.ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో దోపిడీని అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. వైద్యం పేరుతో దోపిడీ చేస్తున్నారన్నారు. టెస్టులు, స్కానింగ్ లో కమిషన్లు నొక్కుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఓపీ, ఐపీ పేర్లతో ఎవరికి వారే ఇష్టానుసారంగా ఫీజులు పెంచుకుంటూ అందిన కాడికి దండుకుంటున్నారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కాకాజి కాలనీలో నివేశన గృహాల్లోనే ఆసుపత్రులను ఏర్పాటు చేసుకొని రోగులతో పాటు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పలు ప్రాంతాల్లో కనీసం పార్కింగ్ స్థలాలు కూడా లేవన్నారు. జిల్లా కేంద్రంలోనే ఇంత దోపిడీ జరుగుతున్నా కనీసం జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు హాస్పటల్ యజమాన్యాలు రెచ్చిపోతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్పిటల్స్ పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నేతలు కోరారు.

## ఇది కేసీఆర్ దళం

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఇది కేసీఆర్ దళం.. తాటాకు చప్పుళ్లకు మేం భయపడమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారాకరామారావు హెచ్చరించారు. మొదటి అడుగు మానుకోటలో వేశాం.. ఇక రాష్ట్రమంతా తిరిగి 119 నియోజకవర్గాల్లో గిరిజనులను ఏకం చేసి వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడులపై నిరసనలు, ధర్నాలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ అంటే బంజారా రాష్ట్ర సమితిగా గిరిజనులకు, బంజారాలకు అండగా నిలుస్తామన్నారు. లగజర్లలో గిరిజనులపై జరిగిన దమనకాండకు నిరసనగా సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కేటీఆర్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత అల్లుడి కోసం ఫార్మా కంపెనీ పెడుతూ గిరిజన భూములను లాక్కున్నాడని ఆరోపించారు. ఆదాని, అల్లుడు, అన్న, తమ్ముడు కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరం కావస్తున్నా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదన్నారు. అందుకే వారు కాంగ్రెస్ ను తరిమికొట్టారన్నారు. మహా ధర్నాకు మహబూబాబాద్ వస్తే రాళ్లతో కొడతామని బహిరంగంగా చెబుతున్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధులను పోలీసులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. 14 ఏళ్ల క్రితమే మానుకోటలో తెలంగాణ నిప్పు పుట్టిందని గుర్తు చేశారు. ఐదు వేల మంది వస్తారనుకున్న ఈ మహా ధర్నాకు 25 వేలమంది వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకతను చాటి చెప్పారని కేటీఆర్ అన్నారు. ఏదో చేస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తే హామీలు నెరవేర్చకుండా పూర్తిగా విఫలమైందన్నారు. మహా ధర్నాతో మానుకోటలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకతపై మొదటిగా అడుగు పడిందన్నారు. ఈ అడుగుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమి కొడతామని ఆయన హెచ్చరించారు. లగచర్లకు అధికారులు పోతే కేవలం నిరసన మాత్రమే వ్యక్తం చేశారని, అదే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే తరిమి కొడతారని ఆయన అన్నారు. విమానంలో ఢిల్లీకి పోవడం, రావడమే తప్ప తెలంగాణ రాష్ట్రానికి రేవంత్ రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. ఇప్పటివరకు 28 సార్లు ఢిల్లీ వెళ్లి రూ.28 కూడా ఢిల్లీ నుంచి తీసుకురాలేదని కేటీఆర్ విమర్శించారు. ఈ మహా ధర్నాలో జడ్పీ చైర్మన్ అంగోతు బిందు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు, మధుసూదనా చారి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, రెడ్యానాయక్, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్ నాయక్, హరిప్రియనాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపనేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, హరిప్రియ నాయక్, సండ్ర వెంకట వీరయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

- టీయూఎఫ్ పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ
- జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు 27-28 తేదీలలో కరీంనగర్ నుండి వేములవాడ పాదయాత్ర పోస్టర్ ను చెన్నారావుపేట మండల కేంద్రంలోని స్వామి వివేకానంద సెంటర్ విగ్రహం వద్ద మండల అధ్యక్షుడు ఉప్పునుతుల, లింగమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్, హాజరై పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ 27, 28వ తేదీల్లో జరిగే పాదయాత్రకు తెలంగాణ మలిదశ ఉద్యమకారులందరూ తప్పక హాజరు కావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మ్యానిఫెస్టోలోపెట్టిన హామీలను నెరవేర్చాలని అన్నారు. జార్కండ్ తరహాలో ఉద్యమ కారులకు 25 వేల రూపా యల పెన్షన్ 250 గజాల ఇంటి స్థలాన్ని ఎలక్షన్ల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చా లని ప్రతి ఒక్క ఉద్యమకా రులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండదం డగా ఉండాలని కోరారు.అలాగే స్వామి




వివేకానంద విగ్రహాన్ని తొలగించలనే ప్రయత్నాలను ఉద్యమకారుల ఫోరం కండిస్తుంది అన్నారు.ఈకార్యక్ర మంలో కవులు కళాకారుల రాష్ట్ర కొకన్వీనర్ శ్రీనివాస్, ఉద్యమ కారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి కౌడగాని రాజీరు , జిల్లా మీడియా అధికార ప్రతినిధి నర్మెట యాదగిరి, నర్సంపేట మండల అధ్యక్షుడు మురలీధర్ రెడ్డి .పట్టణ అధ్యక్షుడు మాదాసి శ్రీనివాస్, పట్టణ గోనెల కరుణాకర్ , మండల కార్యదర్శి శీలం రాజు, రజిత, తదితరులు పాల్గొన్నారు.

## రేపు మంత్రి సీతక్క రాక

**వరంగల్ వాయిస్, గణపురం :** రేపు గణపురంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థా పనలు చేయనున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రేపాక రాజేందర్ తెలిపారు. గౌడుల ఎల్లమ్మ తల్లి దేవాలయంతో పాటు గణపురం ఎన్టీఆర్ విగ్రహం నుంచి ధర్మ రావుపేట రహదారి వెల్తుర్లపల్లి మోరంచే మాట పనుల శంకుస్థాపనలు మంత్రి చేయనునట్లు పేర్కొన్నారు. అనంతరం గణపురంలో మంత్రి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావులకు జరిగే సన్మాన సభలో భారీ ఎత్తున ప్రజలు పాల్గొనాలని రాజేందర్ కోరారు.

## గణపేశ్వరాలయంలో ప్రముఖుల పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని కాకతీయుల గణపేశ్వరాలయం కోటగుళ్లలో సోమవారం ప్రముఖులు భారీ పూజలు నిర్వహించారు. తహసీల్దార్ కే.రజిత, ఎస్సై సాంబమూర్తి దంపతులు శివార్చన చేసి, అక్కడ దీపాలు వెలిగించి శివలింగాన్ని వస్త్రాలతో అలంకరించి నందికి వస్త్రాలతో అలంకరించి దేదీప్యమానంగా పూజలు చేశారు. కార్తీక మాసం కావడంతో వారు ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎస్సై దంపతులను ఘనంగా అర్చకులు సన్మానించారు.

## ఆపదలో ఆదుకున్న దయన్న



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మహబూబాబాద్ జిల్లాకు వెళ్తున్న సందర్భంలో తొర్రూరు, పెద్దవంగర మార్గమధ్యలో పాలకుర్తి మండలం చెన్నూర్ గ్రామ శివారు లావుడ్యా తండాకు చెందిన లావుడ్య ఇస్తారు చిన్న కూతురు మార్గమధ్యంలో ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడి పోయారు. అది గమనించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తన వాహనాన్ని ఆపి వారికి సపర్యలు చేసి అంబులెన్స్ కు ఫోన్ చేసి వారిని ఆదుకున్నారు.

## జ్యోతిర్లింగాల ఆలయంలో పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చివరి కార్తీక మాసం సోమవారం సందర్భంగా నగరంలోని రెడ్డిపురం భగత్ సింగ్ నగర్ లోని శ్రీ ద్వాదశ జ్యోతి ర్లింగాల ఆలయంలోని ప్రధాన అర్చకులు రమేష్ చారి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు.

# పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లా పరిషత్ హైస్కూల్, అంగన్వాడీ కేంద్రం, జామండ్లపల్లి, ఆశ్రమ హై స్కూల్ బాలికలు, ముత్యాలమ్మగూడెం, టీజీ డబ్ల్యూఆర్ఇఐఈఎస్ లలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ వారికి అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, క్లాస్ రూములు, పరిసరాలు, స్టోర్స్, వంట గదులను స్వయంగా తనిఖీ చేశారు. పిల్లలకు స్వచ్ఛమైన రుచికరమైన ఆహారం అందించాలని, ఆహారం వండే సిబ్బంది పరిశుభ్రంగా చేతులు కడుక్కొని ఆహార పదార్థాలను సిద్ధం చేయాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, నిరంతరం విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, ప్రతి విద్యార్థినీ, విద్యార్థుల వ్యక్తిగత, పరిశుభ్రత, మానసిక వికాసం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారిని గమనిస్తూ అవగాహన కల్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి సబ్జెక్టు పై ఎలాంటి సందేహాలు ఉన్న సమాధానాలు చెబుతూ విద్య బోధనలు అందించాలని సూచించారు. వసతి గృహాలలో ఎలాంటి



ఇబ్బందులు కలగకుండా వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు, ఆర్ సీఓలు, నిత్యం గమనిస్తూ ఉండాలని, ప్రత్యేక అధికారులు కూడా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కురవి మండల ప్రత్యేక అధికారి నరసింహస్వామి, కేజీవీబీ, మోడల్ హైస్కూల్ నేరెడ, డోర్నకల్ ప్రత్యేక అధికారి నరసింహమూర్తి, డోర్నకల్ లో వసతి గృహాలను పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రత్యేక అధికారులు వసతి గృహాల నిర్వహణపై నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ ప్రభుత్వ సూచనల ప్రకారం విద్యార్థిని విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## వాస్తవిక ఆత్మ రక్షణలో కరాటే కోచ్ మణికంఠకు బ్లాక్ బెల్ట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వాస్తవిక స్వీయ రక్షణ తోనే ఆత్మ రక్షణ మార్షల్ ఆర్ట్స్ తో కాదని, కేవలం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వలన ఆత్మలక్షణ రాదని ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ కోచ్ గడదాసు మణికంఠ తెలిపారు. దాదాపు సంవత్సరం పాటు వాస్తవిక స్వీయ రక్షణలో శిక్షణ పొందుతున్న మణికంఠ నవంబర్ 23, 24 తేదీలలో ముంబైలో జరిగిన ఆత్మ రక్షణ శిక్షణలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. ఇందులో భాగంగా కేవలం వాస్తవిక స్వీయ రక్షణతోనే ఆత్మ రక్షణ చేసుకోగలుగుతారని కరాటే వంటివి ఇతర మార్షల్ ఆర్ట్స్ అవి వాస్తవిక స్వీయ రక్షణ నేర్చుకోవడానికి సహాయపడతాయని, కానీ అవి ఆత్మ రక్షణకు సరిపోవని ఈ సందర్భంగా తెలిపారు. డిసెంబర్ 1 నుంచి వరంగల్ కొత్తవాడలోని మణి మార్షల్ ఆర్ట్స్ అండ్ ఫిట్ నెస్ అకాడమీలో ప్రతిఒక్కరికి ఆత్మ రక్షణ శిక్షణ తరగతులు ప్రారంభం చేస్తానని మణికంఠ తెలిపారు.

## వరంగల్ పోలీసులకు ప్రశంసాపత్రాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు రాష్ట్ర పోలీస్ డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రశంసా పత్రాలు అందుకున్న పోలీస్ అధికారులు గతంలో పనిచేసిన పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి లాంటి మత్తు పదార్థాలను నియంత్రించడంతో పాటు, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన నేరస్థులకు పది సంవత్సరాలకు పైగా జైలు శిక్ష పడటంలో కృషి చేసినందుకుగాను హైదరాబాద్ పోలీస్ శాఖ ప్రధాన కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ డీజీపీ చేతుల మీదుగా వరంగల్ పోలీస్ కమిషరేట్ కు చెందిన పోలీస్ అధికారులు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ప్రశంస పత్రాలు అందుకున్న వారిలో కేయూసీ ఇన్ స్పెక్టర్ రవికుమార్, సుబేదారి ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, సంగెం ఎస్ఐ నరేష్, పరకాల హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ ఉన్నారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలను అందుకున్న పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## కుంగ్ ఫూలో సెయింట్ ఆంటోనీ విద్యార్థుల ప్రతిభ



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** తొమ్మిదవ నేషనల్ లెవెల్ ఓపెన్ టు ఆల్ మార్షల్ ఆర్ట్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు కాజీపేట న్యూపారడైజ్ ఫంక్షన్ హాల్ లో కరాటే గ్రాండ్ మాస్టర్ ధనరాజ్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ధర్మసాగర్ సెయింట్ అంటోని హైస్కూల్ విద్యార్థులు కుంగ్ ఫూ, కరాటేలలో ప్రతిభ చాటారు. చదువుతో పాటు క్రీడలలో కూడా తమ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అండర్-14 స్పారింగ్ విభాగంలో ఆర్.సందీప్, ఈ.కౌశిక్, గోల్డ్ మెడల్ లో జి.ఈశ్వర్, ఈ.అభినవ్ సిల్వర్ మెడల్ లో, ఈ.సుమిత్ బ్రాంచ్ మెడల్ సాధించారు. సెయింట్ ఆంటోని హైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ దామెర మేరీ ఆధ్వర్యంలో విద్యార్థులు కుంగ్ ఫూలో శిక్షణ పొందారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను కోచ్ దామెర మేరినీ, స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఎలిజబెత్ రాణి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని ఎడ్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మండల తాజా మాజీ జడ్పీటీసీ అయిత కోమల రాజిరెడ్డి నోటు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి , వల్లెంకుంట హెచ్ఎం సుదర్శనం, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జంగిడి సమ్మయ్య, మత్స్య శాఖ జిల్లా డైరెక్టర్ జంగిడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఎంపీడీవో తనిఖీలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం, పెద్ద తండా, దూప తండా, పాఠశాలను ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు, భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న వంటలను, కూరగాయలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన గుండు చందన పూర్ణచందర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గోవాలో జరిగిన కరాటే జాతీయ టోర్నమెంట్ లో మన రంగశాయిపేటకు చెందిన ఇద్దరు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించడం అభినందనీయమని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అన్నారు. ఈ నెల 7 నుంచి 10 వరకు గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్ లో రంగశాయిపేటలోని పరమేశ్వర కరాటే అకాడమీకి చెందిన తండ విస్నిత, తాటికొండ సంజయ్ సచిన్ అనే ఇద్దరు కరాటే విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించినందున సోమవారం 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ ఆ పిల్లలను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు, సెల్ఫ్ డిఫెన్స్ కు కరాటే విద్య ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రంగశాయిపేట ప్రాంతంలో పాఠశాల స్థాయి కరాటే విద్యార్థులు చాలామంది శిక్షణ పొందుతున్నారని, వారిని వివిధ టోర్నమెంట్లలో పాల్గొనే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు, కరాటే శిక్షకులు ప్రోత్సహించాలని కోరారు. ఇటీవల గోవాలో జరిగిన జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్ లో 5 నుంచి 13 ఏళ్ల బాలికల ఏజ్ గ్రూపు బ్లాక్ బెల్ట్ విభాగంలో తండ విస్మిత గోల్డ్ మెడల్ ను సాధించిందని, బాలుర గ్రీన్ బెల్ట్ విభాగంలో తాటికొండ సంజయ్ సచిన్ గోల్డ్ మెడల్ ను సాధించారని గుండు చందన పూర్ణచందర్ తెలిపారు. గోల్డ్ మెడల్స్ సాధించిన ఇద్దరు విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, వీరికి కరాటేలో శిక్షణను ఇచ్చిన కోచ్ లు కరాటే మాస్టర్ తూమల పరమేశ్వర్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ చీకటి చిన్న సమ్మయ్యలకు ధన్యవాదాలు తెలిపారు.

# పూజారి సాంబయ్యకు ఘన సన్మానం

- **జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించిన ఆత్మీయులు**

**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఆదివారం పూజారి సాంబయ్యకు ఆత్మీయ మిత్రులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూజారి సాంబయ్యకు 75 ఏళ్లు నిండిన సందర్భంగా ఆత్మీయులు, ఆయన వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులు పూజారి సాంబయ్య-కళావతి దంపతులను జీవన సాఫల్య పురస్కారం అందజేసి ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ పున్నం వీరారెడ్డి అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథిగా పాక రాజమౌళి హాజరై మాట్లాడుతూ పూజారి సాంబయ్య తన జీవిత కాలంలో ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా





తీర్చిదిద్దారన్నారు. అలాగే, ఆర్ఎస్ఎస్ లో క్రీయాశీలకంగా పనిచేస్తూ.. ఎందరో విద్యార్థులను అందులో చేర్పించి సమాజ సేవ చేసేలా ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పూజారి సాంబయ్య మాట్లాడుతూ తన సేవలను గుర్తించి జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించిన ఆత్మీయులు, పూర్వ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, తేళ్ల రాజమౌళి, ముక్కా రాజేశ్వరయ్య, పెద్దిరెడ్డి మల్లారెడ్డి, పున్నం ఇంద్రారెడ్డి, పున్నం రాజిరెడ్డి, కేతిపెల్లి ఆదిరెడ్డి, బోనేపల్లి సాంబరెడ్డి, పూర్వ ఆచార్యులు పూజారి రాజయ్య, పూజారి సుదర్శన్, పూర్వ విద్యార్థులు పోద్దుటూరి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ముక్కా దిలీప్, ముదుపు చిన్నప్ప రెడ్డి, చల్లా వేమన్ రెడ్డి, బంధుమిత్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో..

### సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



**వరంగల్ వాయిస్, బీమారం :** పవిత్రమైన కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని బీమారం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బీమారంలోని అగస్త్య బ్రాహ్మణ భవనంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు కృష్ణశర్మ ఆధ్వర్యంలో గణపతి నవగ్రహ పూజ, సత్యదేవుని అభిషేకం, కథ మొదలగు పూజలను శాస్రోక్తంగా జరిపించారు. తదుపరి ధాత్రీనారాయణ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగ సంఘ అధ్యక్షులు మోత్కూరు మనోహర్ రావు మాట్లాడుతూ గత ఇరువది సంవత్సరాలనుంచి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి కార్తీక మాసంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు ఆర్థికంగా సహకరిస్తున్న సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. అన్నప్రసాద ప్రాయోజకులుగా రూ.5,116 విరాళం అందించిన భళ్ళమూడి శ్రీనివాసరావు-వకుళ దంపతులు, మోత్కూరు ఇందిరామనోహర్ రావు దంపతులకు కార్యదర్శి ముసిపట్ల శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వామి వారి వ్రతాచరణలో పొట్లపల్లి కిరణ్, ముసిపట్ల శ్రీనవాసరావు, చిట్టంపల్లి సాత్విక్, లకినెపల్లి ప్రశాంత్, సుధాకర్ రావు, దేవులపల్లి ప్రభాకర్ రావు, ఉట్ల శ్యాంసుందర్ రావు, లక్ష్మిమనోహర్, ఎరబాటి రాజేశ్వర్ రావు, రమాకాంత్, మల్లెం రంగారావు కృష్ణ, తదితరులు దంపతుల సమేతంగ పాల్గొని భక్తిశ్రద్దలతో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొట్లపల్లి శ్రీనివాసరావు, చిట్టంపల్లి రవీందర్ రావు, గోపాలకృష్ణ, సుదర్శన్ రావు, కృష్ణప్రసాద్, వెంకటేశ్, గాయత్రి, రాజకుమారి, లక్ష్మి, వాణి పాల్గొన్నారు.

## విద్యార్థులకు మానసిక రుగ్మతలపై అవగాహన



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మానసిక రుగ్మతలపైన మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ప్రహసిత్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సెల్ ఫోన్ల వాడకంతో పిల్లల్లో మానసిక పరిపక్వత లేక అనేక సమస్యలతో బాధపడుతున్నారని వాటి నుంచి బయట పడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకెళ్లాలన్నారు. మానసిక సమస్యలపైన అవగాహన కలిగించేందుకు ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్ ను ఏర్పాటు చేసిందని 144 16 కాల్ కి ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ స్పందన సీహెచ్ఓ హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వామి వివేకానందుడి విగ్రహం పరిశీలన

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** స్థానిక బస్టాండ్ సెంటర్ లో ఉన్న స్వామి వివేకానందుడి విగ్రహాన్ని విశ్వహిందూ పరిషత్ వరంగల్ జిల్లా సహ కార్యదర్శి మల్యాల రవి, నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు చొల్లేటి జగదీశ్వర్, కార్యదర్శి వేల్పుల శ్రీధర్, సహ కార్యదర్శి ముసుకు రాజేందర్ లు ఆదివారం పరిశీలించారు. వివేకానందుడి విగ్రహ ప్రాంగణ పరిసరాలను వీహెచ్ పీ నేతలు శుభ్రం చేశారు. విగ్రహాన్ని కడిగి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానందుడి విగ్రహాన్ని తొలగించాలని చెన్నారావుపేటలోని పార్వతీ పరమేశ్వర రైస్ మిల్ యజమాని కొమురవెల్లి సాత్విక్ గుప్తా చేస్తున్న ప్రయత్నాలపై విశ్వహిందూ పరిషత్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా సహ కార్యదర్శి మల్యాల రవి మాట్లాడుతూ యావత్ ప్రపంచానికి ఆదర్శప్రాయుడైన స్వామి వివేకానందుడి విగ్రహం చెన్నారావుపేటలో నెలకొల్పటం గర్వ కారణమన్నారు. నర్సంపేట-నెక్కొండ ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం కలగకుండా, ఆర్టీసీ బస్టాండు పక్కన ఉన్న వివేకానందుని విగ్రహాన్ని తొలగించాలనే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు. ఎవరైనా దుష్టశక్తులు విగ్రహాన్ని ముట్టుకునే ప్రయత్నం చేస్తే విశ్వహిందూ పరిషత్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. వివేకానందుడి విగ్రహాన్ని




రక్షించుకోవాల్సిన బాధ్యత చెన్నారావుపేట ప్రజలపై ఉందని మల్యాల రవి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వేములపల్లి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెవ్వ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు వరంగంటి సంతోష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ననుమాస కర్ణాకర్, కార్యదర్శులు దొంతి సంతోష్, తాళ్లపల్లి రమేష్, ముఖ్య సలహాదారులు ఈగ సత్యనారాయణ, హంస సాంబయ్య, గొడిశాల మల్లయ్య, కాలె రాములు, వనపర్తి మల్లయ్య, మంద రంజిత్, కొత్త ఉపేందర్, సిద్ధ ఉపేందర్, దొనికల వీర భాస్కర్, నాంపల్లి రాజు, తాడిపత్రి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచర్ల అరెస్ట్

**➲ బంగారం, నగదు స్వాధీనం**



**వరంగల్ వాయిస్, సుబేదారి :** చైన్ స్నాచర్లను అరెస్ట్ చేసి బంగారం, నగదు డబ్బులను సుబేదారి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి వివరాలు వెల్లడిస్తూ సెప్టెంబర్ 11న ఫిర్యాదురాలు అనుమందల సమ్మక్క సాయంత్రం హనుమకొండలోని అదాలత్ నుంచి వెల్లు రోడ్డులోని ఒక అపార్ట్ మెంట్ ముందు నుంచి నడుచుకుంటూ వెళుతుండగా మోటార్ సైకిల్పై ఇద్దరు వ్యక్తులు వచ్చి తన మెడలోని బంగారు పుస్తెల తాడు లాక్కొని అక్కడి నుంచి పారిపోయారని దరఖాస్తు ఇచ్చింది. దీంతో సోమవారం ఉదయం 9.30 గంటలకు అదాలత్ జంక్షన్ లో పోలీసులు వాహనాలు చెకింగ్ చేస్తుండగా అనుమానంగా కనిపించడంతో నిందితులను పట్టుకొని విచారించగా 1)సుబేదారీ పోలీస్ స్టేషన్ పరిధి లో–1, 2) కేయూ పోలీస్ స్టేషన్ పరిధి లో–2, 3) మట్వాడ పీఎస్ పరిధి లో–1, 4) స్టేషన్ ఘనపూర్ పి యస్ పరిధి లో–1, చైన్ స్నాచింగ్ లు చేసినట్లుగా ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. నిందితులు రోహిత్ కుమార్ శర్మ (19)విద్యార్థి, సీసీఎల్ వారిగా గుర్తించి వారు దొంగతనాలను ఎంచుకున్న తీరును పోలీసులు విచారించారు. నిందితుడు, సీసీఎల్ ఇద్దరు రాజస్థాన్ స్టేట్ కు చెందిన వారని తెలిపారు. ఇద్దరు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకొని సొంత రాష్ట్రంలో దొంగతనాలు చేస్తే దొరికి పోతామని వరంగల్ కు వచ్చి కాజీపేట లో రూమ్ తీసుకొని ఉంటూ వారు తీసుకొని వచ్చిన స్పెండర్ ప్లస్ బైక్ పై తిరుగుతూ సుబేదారీ, యూనివర్సిటీ, మట్టె వాడ, స్టేషన్ ఘనపూర్ పీఎస్ పరిధి లో చైన్ స్నాచింగ్ చేశారని తెలిపారు. వారి నుంచి 10 గ్రాముల బంగారం, నగదు రూ.80,000, నిందితులకు సంబంధించిన ఒక స్పెండర్ ప్లస్ బైక్, రెండు రియల్ మీ మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సుబేదారి ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఎస్సై, సిబ్బంది, సీసీఎస్ పోలీసులను ఏసీపీ దేవేందర్ రెడ్డి అభినందించారు.

# మాజీ ఎమ్మెల్యే చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని పోచారం గ్రామ బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ పెండ్లి బాపురెడ్డి తల్లి పెండ్లి శాంతమ్మ కొద్దిరోజుల క్రితం మృతిచెందడంతో సోమవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శాంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

# భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలి

**నవ భారత మండల సమైక్య సభ్యులకు కలెక్టర్ అభినందన**



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** నవభారత మండల సమైక్యకు సౌత్ జోన్ స్థాయిలో ప్రథమ స్థానం రావడంతో సోమవారం జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రఘునాథపల్లి మండల నవభారత సమైక్య కార్యవర్గానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ రోహిత్ సింగ్ తో పాటు ఉన్నతాధికారులు శాలువాతో పాటు మెమొంటాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో అవార్డు రావడం అభినందనీయమని, రానున్న రోజుల్లో కూడా మరిన్ని అవార్డులు వచ్చే విధంగా సమాఖ్య కార్యవర్గం సిబ్బంది కృషి చేయాలని ఆయన కోరారు.

# ప్రైవేటు హాస్పిటల్ పై చర్యలు తీసుకోవాలి

**డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి**




**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో వైద్యం పేరుతో వ్యాపారం నిర్వహిస్తూ పేషంట్ల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్న పరకాల పట్టణంలోని ప్రైవేటు హాస్పటల్ పై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, జిల్లా వైద్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) అప్పయ్యకు వినతి పత్రం అందజేశారు. పరకాలలో ఉన్న ప్రైవేటు హాస్పిటళ్లు గ్రామాల్లో నుంచి వచ్చే పేషెంట్లు అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తూ దోచుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి, హాస్పిటల్లో వసూలు చేసే ఫీజులను నోటీసు బోర్డులో పొందుపరచకుండా, ఇష్టానుసారంగా ఫీజులు పెంచుకొని హాస్పిటల్ కు వచ్చే పేషెంట్లను దోచుకుంటున్నారు. అవసరం లేకున్నా టెస్టులు స్కానింగ్ లో నిర్వహిస్తూ, హాస్పిటల్ ఆవరణంలోనే మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకోవడం, ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా వాళ్ల మందులనే రాస్తూ, జనరిక్ మందులను రాయకుండా కుట్ర పన్నుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు హాస్పిటళ్లపై చర్యలు తీసుకోవాలనిడీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రంలో కోరారు.

# పంచకూట మహాదేవ స్వామికి అభిషేకాలు



**వరంగల్ వాయిస్ ఆత్మకూర్ :** కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని ఆత్మకూర్ పంచకూట మహాదేవ స్వామి శివాలయంలో వేద పండితులు రవీంద్ర శర్మ పర్యవేక్షణలో పంచ లింగాలకు పంచ అమృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. పంచలింగాల శివాలయంలో ముందుగా గణపతికి విశేష అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఉదయం నాలుగు గంటల నుంచి పంచలింగాలకు అభిషేకాలను నిర్వహించారు. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నది జలాలు, పంచ అమృతాలు, పూల మాలలు, పండ్లు కొబ్బరికాయలు, తరలివచ్చి పంచ లింగాలకు అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఉసిరికాయ దీపాలు, 365 వత్తులతో ప్రత్యేక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, జంట నాగులకు, నవగ్రహాలకు భక్తులు విశేష పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. ఉదయం నుంచి భక్తులతో పంచలింగాల శివాలయం కిటకిటలాడింది.

# సర్వే డాటా ఎంట్రీకి ఏర్పాట్లు



**వరంగల్ వాయిస్, దామెర :** సామాజిక, ఆర్థిక, ఉద్యోగ ఉపాధి రాజకీయ కుల గణన సర్వేలో భాగంగా దామెర మండలంలో ఇంటింటి సర్వే సుమారుగా 97 శాతం పూర్తికాబడింది. పూర్తికాబడిన సర్వేఫారాలను జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు సంబంధిత వెబ్ సైట్ లో నమోదు చేసేందుకు సోమవారం గూడెప్పాడు క్రాస్ రోడ్డులో గల విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 34 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చి సర్వేను నమోదు చేయుటకు తగు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ రంగాచారి, ఎంపీఎస్ఓ ఏ.శ్రీదేవి. పంచాయతీ కార్యదర్శులు. ఎన్యూమరేటర్లు, డాటా పర్యవేక్షణ అధికారికారులు పాల్గొన్నారు.

# కేయూ పరిధిలో ఇన్ స్టంట్ పరీక్షలు నిర్వహించాలి

**◆ కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎల్ఎల్ బీ, ఎఎల్ఎం, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తి విద్య కోర్సులలో అన్ని సబ్జెక్టులు పాసై, చివరి సెమిస్టర్ లో ఒక సబ్జెక్టు ఫెయిలైన విద్యార్థులందరికీ ఇన్స్ స్టంట్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల విలువైన విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడాలని కోరుతూ సోమవారం కాకతీయ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్లింగ్ ముందు పీడీఎస్ యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రతినిధి బృందంగా అందజేశారు. గతంలో కాకతీయ యూనివర్సిటీ ఇయర్ వైస్ గా పరీక్షలు నిర్వహించినప్పుడు విద్యార్థుల విలువైన విద్యా సంవత్సరం వృథా కాకుండా ఫైనల్ ఇయర్ లో ఒక సబ్జెక్టు ఫెయిలైన విద్యార్థులకు ఇన్స్ స్టంట్ పరీక్షలు నిర్వహించేదన్నారు. కానీ ప్రస్తుతం సెమిస్టర్ పరీక్ష విధానాన్ని అనుసరిస్తుండటం వలన ఫైనల్ సెమిస్టర్ లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ పరీక్ష రాసి పాస్ కావాలంటే ఒక సంవత్సర కాలం పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎల్ ఎల్ బీ, ఎల్ఎల్ఎం, డిగ్రీ, పీజీ ఫైనల్ ఇయర్, ఫైనల్ సెమిస్టర్ లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయితే మళ్లీ సెమిస్టర్ పరీక్షలు వచ్చేంత వరకు సంవత్సర కాలం ఎదురు చూస్తూ, రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయిలో నిర్వహించే వివిధ ఎంట్రన్స్ లను రాసుకునే అవకాశం విద్యార్థులకు లేకుండా పోతున్నదని తెలిపారు. కాబట్టి, విశ్వవిద్యాలయాల అధికారులు విద్యార్థుల విలువైన సంవత్సర కాలం వృథా కాకుండా ఎల్ఎల్ బీ, ఎల్ఎల్ఎం, డిగ్రీ పీజీ ఇతర వృత్తి విద్య కోర్సులలో ఇన్ స్టంట్ పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కాంపాటి పృథ్వీ, రాష్ట్ర నాయకులు వెంకటేష్, కావ్య, కాకతీయ యూనివర్సిటీ నాయకులు అనూష, బాలకృష్ణ, పూజిత, హేమ, సంగీత, అఖిల, ఉమేష్, ఉదయ్, శ్రీకాంత్, రవీందర్, అపర్ణ జ్యోతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**వరంగల్ వాయిస్, దామెర :** కాంగ్రెస్ ప్రజా పాలనలో భాగంగా సోమవారం పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి సూచనల మేరకు దామెర పరిధిలోని గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి దామెర కాంగ్రెస్ నాయకుల శ్రీధర్ రెడ్డి, రమణారెడ్డి, భిక్షపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు బిల్లా రమణారెడ్డి స్థలం పరిశీలించారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, నవంబర్ 25, 2024

## డ్రంకెన్ డ్రైవ్ లో 19 మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ నలుగురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం రూ. 4500 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 19 మందికి రూ.21,500 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె రామకృష్ణ తెలిపారు.

## ప్రియాంక విజయం పట్ల హర్షం



**వరంగల్ వాయిస్, దామెర :** కేరళలోని వయనాడ్ పార్లమెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక గాంధీ 3.94 లక్షల మెజార్టీ గెలుపొందడంపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు బిల్లా రమణారెడ్డి వ్యక్తం చేశారు. ఈ పార్లమెంటు నియోజకవర్గం ఇదివరకు రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉప ఎన్నికలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ కు ఆ ప్రాంత ప్రజలు ఓటు ద్వారా నీరాజనం పలికారని ఆయన తెలిపారు.

## ఢిల్లీలో జరిగే 16వ ఆరిక సంఘం సమావేశానికి మేయర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు ఢిల్లీలో జరగనున్న 16వ ఆర్థిక సంఘం సమావేశానికి హాజరుకావాలని 16వ ఆర్థిక సంఘం ఆహ్వానం అందిన క్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి సోమవారం నగరం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఢిల్లీలో 16వ ఫైనాన్స్ కమిషన్ 10 లక్షల కంటే తక్కువ జనాభా గల నగరాల కేటగిరీకి చెందిన నగరాల జాబితాలో నగరం నుంచి మేయర్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా నగరంలో వివిధ పథకాల కింద చేపట్టబడి కొనసాగుతున్న అభివృద్ధి పనుల స్థితి గతులు, పురోగతిని మేయర్ వివరించడంతో పాటు నగరాభివృద్ధికి అవసరమైన నిధుల గురించి మేయర్ ఆర్థిక సంఘానికి నివేదించనున్నారు.

## సీసీ కెమెరాల ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని లష్కర్ సింగారం నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం హనుమకొండ ఇన్ స్పెక్టర్ సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ సతీష్ మాట్లాడుతూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వలన దొంగతనాలను అరికట్టవచ్చని, భయం లేకుండా అందరికి సేఫ్టీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఎస్సై సతీష్, కాలనీ వాసులు నదునూరి రాజేష్ కన్నా, ఎర్ర రాము,ఎర్ర మహేందర్, దామెర సుదర్శన్, మున్నంగి రఘు, బొక్క రాజేష్, అలవాల కుమార్, ఎర్ర నరేష్, సిలువేరు ఎల్లా స్వామి, మున్నంగి బాబు, దామెర అరుణ్, అల్వాల ఎల్లేష్, ఎర్ర వరదరాజు, సిలువేరు కిరణ్, ఎర్ర అరుణ్, మట్టెడ అనిల్, కంజర్ల మధుకర్, ఎర్ర లక్ష్మణ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## యోగా ఇన్ స్ట్రక్టర్లకు నియామక పత్రాల అందజేత

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లాలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో డిపార్టుమెంట్ ఆఫ్ ఆయుష్ శాఖ విభాగంలో ఎంపికైన యోగా ఇన్‌స్ట్రక్టర్లకు అపాయింట్‌మెంట్ లెటర్లను రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (ఆర్డీడీ ) ప్రమీలా దేవి సోమవారం హనుమకొండలోని కార్యాలయంలో అందజేశారు. కొత్తగా ఎంపికైన యోగా ఇన్‌స్ట్రక్టర్లు జిల్లాలోని గర్భవతులకు, రోగులకు, మానసిక రోగులకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో యోగా నేర్పిస్తారని ఆర్‌డీడీ తెలిపారు. వరంగల్ జిల్లాలో ఆయుష్మాన్ పరిధిలో ఎంజీఎం హోమియో విభాగంలో ఎస్. ప్రేమలత, ఆంజనేయులు, ఎంజీఎం యూనానీ విభాగంలో మౌనిక, వశిష్ట, రాంచంద్రాపురంలో రజిత, రామకృష్ణ, సన్నూరులో విష్ణు, కల్పన, ఎల్కుర్తిలో మహేష్, మేఘన, నల్లబెల్లిలో మానస, బుధరావుపేట నసీఫా, ఇటుకాలపల్లిలో వినోద యోగా ఇన్ స్ట్రక్టర్లుగా ఎంపికయ్యారని, వారికి నియామకపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ డిపార్టుమెంట్ ఇంచార్జి మైదం రాజు, డీపీఎం జి.రాజు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తా



- **ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ**

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని, హక్కుల సాధనకు జిల్లా సంఘాలు కృషి చేయాలని అన్ని జిల్లాల వ్యాప్తంగా ఆర్యవైశ్యులచే జీవిత సభ్యత్యాలు జరిపించడానికి కృషి చేయాలని జిల్లా సంఘాలకు తమ వంతు సహకారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. హనుమకొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, నూతన కార్యవర్గం, అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకారం హసన్ పర్తి మండలంలోని భీమారంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి వంగేటి అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా తోట సురేష్, దొడ్డి మోహన్ రావు, కోశాధికారిగా శ్రీరామ్ రవీందర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పడకంటి జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా దొడ్డ దేవి, కోశాధికారిగా అయిత పద్మజ, యువజన విభాగం అధ్యక్షుడిగా అడ్డగుడి సతీష్, ప్రధాన కార్యదర్శిగా సూర్యదేవర శ్రావణ్ కుమార్, కోశాధికారిగా యాంసాని వెంకటేష్, తదితర విభాగలకు ఎన్నికోబడిన వారిని రాష్ట్ర నాయకులు రేణుకుంట్ల గణేష్ గుప్తా, ఇరుకుల్ల రామకృష్ణ, ఆగిరి వెంకటేష్, ఉప్పల శారద, నూతన కమిటీలచే ప్రమాణ స్వీకారం చేయించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, హసన్ పర్తి మండల అధ్యక్షులు చెకిలం రాజేశ్వరరావు, విని శెట్టి రఘు, కొనిశెట్టి మునేందర్, పబ్బతి నాగభూషణం, ఏలుగూరి శివకుమార్, వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు వివిధ జిల్లాల నాయకులు పాల్గొని జిల్లా నూతన కమిటీ ప్రమాణ ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేశారు.

# బీసీటీఏ హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హైదరాబాద్ నగరంలో సోమవారం బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ కృష్ణుడి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వివిధ జిల్లా శాఖలను ప్రకటించారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జిగా తుమ్మ తిరుపతి, అలాగే హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా తుమ్మ తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా కందగట్ల సురేష్, కోశాధికారిగా కొత్తకొండ కుమారస్వామిలను నియమించారు. ఈ సందర్భంగా బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు, జాక్టు సెక్రటరీ జనరల్ అయిన శ్రీకృష్ణుడు మాట్లాడుతూ బలహీన వర్గాల బహుజనుల బిడ్డ అయిన తెలంగాణ ఉద్యమంలో సకలజనులు సమ్మెలో ఉపాధ్యాయ లోకాన్ని ముందుకు నడిపించి తెలంగాణ సాధనలో ప్రముఖ పాత్ర పోషించి తెలంగాణ నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసిన ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో దిట్ట అయినా పూల రవీందర్ ను ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని రాష్ట్ర బీసీటిఏ బలపరుస్తుందన్నారు. బీసీటీఏ ఉమ్మడి జిల్లాల బీసీటీఏ సభ్యులందరూ కూడా బీసీ బిడ్డ అయిన పూల రవీందర్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్, కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పై కుట్ర పన్నుతున్న కేటీఆర్

- **ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్**



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** లగచర్ల పేరుతో ధర్నా ఎందుకు, మహబూబాబాద్‌లో శంకర్‌నాయక్ దౌర్జన్యాలు చేసినప్పుడు ఎక్కడున్నావ్, అభివృద్ధి పేరుతో 30 మంది గిరిజనుల భూములు నీ ప్రభుత్వం లాక్కోలేదా, అప్పుడు గిరిజనుల గోడు నీకు వినిపించలేదా అని కేటీఆర్ ను మహబూబాబాద్ ఎమ్మెల్యే డా భూక్యా మురళి నాయక్ ప్రశ్నించారు. ఆ భూముల పక్కనే మీ పార్టీ నేతల భూములను మాత్రం ఎందుకు ముట్టుకోలేదన్నారు. వాళ్లకు లబ్ది చేయడం కోసమే ఎస్టీల భూముల్లో సర్కార్ భవనాలు కట్టారా, దానికి ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే భూక్యా మురళీ నాయక్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీ కోసం గిరిజనుల భూములు లాక్కున్నప్పుడు గిరిజనులు గుర్తులేద అని అన్నారు. రవినాయక్‌ను హత్య చేసినప్పుడు మానుకోటకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. నీ రాజకీయం కోసం గిరిజనులను వాడుకుంటావా అన్నారు. గత ఎన్నికల్లో లంబాడాలు కాంగ్రెస్‌కు మద్దతు పలికినందుకు ఇలా కుట్రలు పన్నుతున్నావా అని కేటీఆర్ ను నిలదీశారు. కేటీఆర్ నీ కుట్రలు ఏమాత్రం ఫలించవని ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్ హెచ్చరించారు. నీ నైతికత ఉంటే నీ నియోజకవర్గంలోని నేరెళ్లకు వెళ్లు ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకు థర్డ్ డిగ్రీతో వేధించిన దళితుల కాళ్లు కడిగి క్షమాపణ చెప్పు అన్నారు. దళితురాలు మరియమ్మను లాకప్‌డెత్ చేసినప్పుడు నీవెక్కడికి పోయావన్నారు. ఆ రోజు కళ్లు కనిపించలేదా, చెవులు వినిపించలేదా అని అన్నారు. మల్లన్నసాగర్‌లో రెండు తండాల భూములు ముంచినప్పుడు గిరిజనులు గుర్తు రాలేదా అన్నారు. భూములు ఇవ్వమంటే లాఠీచార్జీ చేసినప్పుడు డ్రగ్స్ తీసుకుని సోయలేకుండా పడుకున్నావా అని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డిని రాళ్లతో తరిమికొడతాననడానికి నీకు ఎంత ధైర్యం, ఇలాంటి కుట్ర రాజకీయాలు చేస్తే నిన్ను ఈ రాష్ట్రం నుంచి, దేశం నుంచే రాళ్లతో తరిమి తరిమి కొట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. పదేళ్లు అధికారంలో ఉండి మానుకోటకు నువ్వు చేసిందేంటని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ రేసులో అడ్డంగా దొరికావు, విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరంలో నీ అయ్య, నీ బావ హరీష్ అడ్డంగా దొరికి పోయారని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఇప్పుడిప్పుడే మీ అసలు స్వరూపం తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మాజీ పీసీసీ సభ్యులు దస్రు నాయక్, కౌన్సిలర్లు రాజు, హరి సింగ్, శ్రీను, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు ఎడ్ల రమేష్ , జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# నేనంటే అస్సలు పడదు





**- అషికా రంగనాథ్**

అందం, అభినయ సామర్థ్యం రెండూ దండిగా ఉన్న కథానాయిక అషికా రంగనాథ్. కలిసొచ్చే అదృష్టం కోసం కళ్లలో దీపాలు పెట్టుకొని మరీ ఎదురు చూస్తున్నది ఈ కన్నడ కస్తూరి. సిద్దార్‌కి జోడీగా ఈ అందాలభామ నటించిన 'మిస్ యు' సినిమా ఈ నేల 29న విడుదల కానుంది. ఎన్.రాజశేఖర్ దర్శకత్వంలో సామ్యూల్ నిర్మించిన ఈ చిత్రంపై అషికా ఎంతో ఆశ పెట్టుకున్నది. ఇటీవల ఈ సినిమా గురించి తను మాట్లాడుతూ 'ఇందులో నా పేరు సుబ్బులక్ష్మి. సిద్దార్ పేరు వాసుదేవ్. నేనంటే తనకు అస్సలు పడదు. కానీ.. అనుకోకుండా నా ప్రేమలో పడిపోతాడు. కారణం ఏంటో తెరపైనే చూడాలి.' అంటూ చెప్పుకొచ్చింది అషికా రంగనాథ్. ఇంకా మాట్లాడుతూ 'నేను ఎలాంటి పాత్రలనైతే ఇష్టపడతానో.. అలాంటి పాత్ర సుబ్బులక్ష్మి. తను ఇన్నోసెంట్. పక్కా ట్రెడిషనల్. ఓ విధంగా ఇది సుబ్బులక్ష్మి కథే. ఇంతటి మంచి పాత్ర ఇచ్చిన దర్శకుడు రాజశేఖర్‌కీ, హీరో సిద్ధార్థ్‌కి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని తెలిపింది అషికా.



## అతనెవరో అందరికీ తెలుసు..

**రిలేషన్‌షిప్‌పై రష్మిక మందన్న**

టాలీవుడ్‌లో మోస్ట్ క్రేజీయెస్ట్ కాంబోలో టాప్‌లో ఉంటుంది విజయ్ దేవరకొండ –రష్మిక మందన్నా. గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాలతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ ఇద్దరు ఆఫ్ స్క్రీన్‌లో కూడా సూపర్ బాండిరగ్ మెయింటైన్ చేస్తుంటారని తెలిసిందే. ఎప్పటికప్పుడు కలిసి కనిపిస్తూ నెట్టింట హాట్ టాపిక్‌గా నిలుస్తుంటారు. ఈ ఇద్దరు రిలేషన్‌షిప్‌లో ఉన్నారని చాలా కాలంగా నెట్టింట చర్చ నడుస్తుంది. అయితే దీనిపై మాత్రం అటు రష్మికకానీ, ఇటు విజయ్ దేవరకొండ కానీ సస్పెన్స్ మెయింటైన్ చేస్తూ వస్తున్నారు. అభిమానుల్లో నెలకొన్న డైలామాకు రష్మిక మందన్నా చెక్ పెట్టేసింది. చెన్నైలో జరిగిన పుష్ప 2 వేడుకలో తన రిలేషన్ షిప్ స్టేటస్‌పై ఓపెన్ అయిపోయింది కన్నడ సోయగం. మీకు ఇష్టమైన వ్యక్తి ఎవరు..? అతడు ఇండస్ట్రీ చెందిన వాడేనా..? అని యాంకర్ అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అతడెవరో అందరికీ తెలుసునని చెప్పింది. రష్మిక సమాధానంతో ఆడిటోరియం అంతా అరుపులు,కేకలతో దద్దరిల్లిపోయింది. విజయ్ దేవరకొండతో ఉన్న రిలేషన్‌షిప్‌పై చాలా కాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు తాజా కామెంట్స్‌తో ఫుల్ స్టాప్ పెట్టేసింది రష్మికమందన్నా. మరోవైపు ఇటీవలే తాను డేటింగ్‌లో ఉన్నానని, ఇప్పుడు తన వయస్సు 35 ఏండ్లు. ఇంకా సింగిల్‌గా ఉండమంటారా..? అందరం ఏదో ఒకటైంలో పెళ్లి చేసుకోవాల్సిందే..అంటూ రిలేషన్‌షిప్ గురించి హింట్ ఇచ్చేశాడు విజయ్ దేవరకొండ. ఈ లెక్కన త్వరలోనే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా పెండ్లిపై క్లారిటీ వచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు సినీ జనాలు.




## వర్మ ఫోన్ స్విచ్ఛాఫ్

ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేసులో ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ విచారణ ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైంది. ముందుగా ఈ కేసులో నవంబర్ 19 (మంగళవారం)న విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపినప్పటికీ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో మరోసారి నోటీసులు పంపించిన మేరకు నేడు విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. రాలేనంటూ లాయర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు వర్మ. దీంతో రంగంలోకి దిగిన ఒంగోలు పోలీసులు హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి వెళ్లారు. అయితే వర్మ అక్కడ లేకపోవడంతో పోలీసులు గాలింపు చేపడుతున్నారు. వర్మ ఫోన్ స్విచాఫ్ అని వస్తుందని తెలుస్తోంది. వర్మ తాను కోయంబత్తూరులో ఉన్నట్టు ట్వీట్ చేయగా.. మరోవైపు సోషల్ మీడియాలో అకౌంట్ హ్యాండిల్స్ మాత్రం హైదరాబాద్‌లోనే చూపిస్తున్నాయట. వర్మకు ఓ ప్రముఖ నటుడు తన ఫాంహౌజ్‌లో ఆశ్రయం ఇచ్చినట్టుగా వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఈ మేరకు శంషాబాద్, షాద్ నగర్ దగ్గర రెండు ఫాంహౌజ్‌లపై ఏపీ పోలీసులు ఫోకస్ పెట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వర్మ ఇంతకీ ఎక్కడున్నారో మరి అంటూ నెట్టింట తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు.

## హిందీలో ఎన్‌టీఆర్‌కు రెండో సినిమా



జూనియర్ ఎన్టీఆర్ యాక్షన్ డ్రామా ప్రాజెక్ట్ వార్ 2తో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో హృతిక్ రోషన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ సినిమా విడుదల కాకముందే తారక్ మరో హిందీ సినిమాకు సంతకం చేశాడన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం యశ్ రాజ్ ఫిలిమ్స్‌తో తారక్ మరో భారీ సినిమా కోసం చర్చలు జరుపుతున్నాడని బీటౌన్ సర్కిల్‌లో ఓ వార్త హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు చెప్పిన కథ తారక్‌కు నచ్చిందట. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే 2025 చివరలో ఈ సినిమా లాంచ్ కాబోతుందట. ప్రస్తుతానికి ఆ డైరెక్టర్ ఎవరనేది సస్పెన్స్ నెలకొంది. యశ్ రాజ్ ఫిలిమ్స్ తరచూ స్టార్ యాక్టర్లలో మూడు సినిమాల ఒప్పందం కుదుర్చుకుంటుందని తెలిసిందే. మరి ఎన్టీఆర్ కూడా ఇలాంటి అగ్రిమెంట్‌కు సంతకం ఏమైనా చేశాడా..? అన్నది తెలియాల్సి ఉంది. మొత్తానికి ఏదేమైనా తారక్ త్వరలో హిందీలో రెండో సినిమాకు సైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడన్నది మాత్రం నిజమేనని తాజా వార్తలు క్లారిటీ ఇచ్చేస్తున్నాయి.





## మాజీ ప్రేయసితో వెంకటేష్ డ్యుయట్

వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. ప్రస్తుతం వెంకటేశ్, ఆయనకు ఎక్స్ గర్ల్ ఫ్రెండ్‌గా నటిస్తున్న మీనాక్షి చౌదరిలపై ఓ అందమైన పాటను దర్శకుడు అనిల్ రావిపూడి చిత్రీకరించే పనిలో ఉన్నారు. డెహ్రాడూన్, ముస్సోరీ, రిషికేశ్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌లో ఈ పాట చిత్రకరణ జరుగుతున్నది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటకు భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో ఈ ఒక్క పాటను మాత్రమే చిత్రీకరిస్తామని, త్వరలోనే మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెడతామని చిత్ర సమర్పకులు దిల్‌రాజు తెలిపారు. ఐశ్వర్య రాజేష్ మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేష్, వీటీ గణేశ్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, నిర్మాత: శిరీష్, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్.



# సంబురంగా సాహిత్యోత్సవం

- సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఘనంగా వేడుకలు
- హాజరైన సీపీ అంబర్ కిషోర్ ఝా, ఎమ్మెల్యే నాయిని
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక కుమార పల్లిలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో 16వ సీఎస్ఏ సాహిత్య ఉత్సవ (లిటరరీ ఫెస్టివల్) కార్యక్రమాలు రెండు రోజులు పాటు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి 23న వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ జా (ఐపీఎస్), 24న జరిగిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. టి.ధనలక్ష్మి, బాసాని లత, రెవరెండ్ ఫాదర్ యన్.సురేందర్ తదితరులు పాల్గొన్నారు. వేడుకలకు అధ్యక్షత వహించిన రెవరెండ్ సిస్టర్ సుజాత (జనరల్ కౌన్సిలర్ ఇంచార్జ్ ఫర్ ఎడ్యుకేషన్) మాట్లాడుతూ విద్యార్థులు ఈ పోటీ ప్రపంచంతో పాటు ముందుకు వెళ్లాలంటే నైపుణ్యాలు పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. కాబట్టి, విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన నైపుణ్యాలను పెంపొందిస్తూ భవిష్యత్తులో దేనినైనా ఎదిరించి నిలబడగలిగే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతోనే ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా సీఎస్ఏ విద్యాసంస్థలు విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలన్నీ కల్పించామని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సాహిత్య వేడుకల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని 22 పాఠశాలల నుంచి సుమారు 864 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కన్వీనర్ గా విచ్చేసిన రెవరెండ్ సిస్టర్ మార్కెట్ (ప్రొవిన్షియల్ సుపీరియర్) ఈ కార్యక్రమంపై తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన పూర్వ విద్యార్థిని రావు పద్మ మాట్లాడుతూ నేడు తను ఇంత గొప్ప స్థాయిలో ఉండడానికి మిషనరీ విద్యాసంస్థల్లో నేర్చుకున్న క్రమశిక్షణ కారణమని తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఈ పాఠశాలలు బాగా అభివృద్ధి చెందాయని, సెయింట్ జోసెఫ్ పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లోనే కాక మరెన్నో రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని తెలిపారు. అదేవిధంగా కార్యక్రమానికి రెవరెండ్ సిస్టర్ డా. బి. వేళాంగిణి (ప్రొవిన్షియల్ కౌన్సిలర్ ఫర్ ఎడ్యుకేషన్ ఇంచార్జ్), కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ బోయపాటి ఫాతిమా, ప్రధానోపాధ్యాయురాలు రెవరెండ్ సిస్టర్ మేరీ జయ ఆధ్వర్యంలో సాహిత్య ఉత్సవ వేడుకలను ఎంతో విజయవంతంగా నిర్వహించారు.

### సాహిత్య పోటీల విజేతలు..

హనును కొండ కుమారపల్లి సెయింట్ జోసఫ్ పాఠశాలలో అంగరంగ వైభవంగా నిర్వహించిన ఎల్యుషన్, ఎస్సే రైటింగ్, క్విజ్ మాక్ పార్లమెంట్, డాక్యుమెంటరీ, స్పెల్ జీ, లైవ్ రిపేరింగ్ వంటి 12 విభాగాలలో జరిగిన పోటీలలో పాల్గోని మెరుగైన ప్రతిభను కనబరచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్థానికకార్పొరేటర్ పోతుల శ్రీమాన్ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

### సెయింట్ జోసఫ్ పాఠశాలకు 11 బహుమతులు

ఆయా విభాగాలలో నిర్వహించిన పోటీలలో సెయింట్ జోసఫ్ విద్యార్థులు 11 బహుమతులను సాధించి వారి ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీలన్నింటిలో అత్యుత్తమ ప్రతిభను చాటుకున్న పాఠశాలకు చాంపియన్ షిప్ ట్రోఫీని ప్రొవిన్షియల్ సుపీరియర్ రెవరెండ్ సి సిస్టర్. మార్గట్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం సాహిత్య ఉత్సవ వేడుకలను ఎటువంటి ఆటంకం లేకుండా దిగ్విజయంగా ముందుకు నడిపించిన సెయింట్ జోసఫ్ పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ సిస్టర్ బోయపాటి ఫాతిమాను, ప్రిన్సిపల్ 'సిస్టర్ మేరి జయకు, ఇతర సిస్టర్లకు, సెయింట్ జోసఫ్ పాఠశాల అధ్యాపక బృందానికీ (వికర్ జనరల్ ఆఫ్ కాటకి స్ట్ సిస్టర్స్ ఆఫ్ సెయింట్ ఆన్) పోతిరెడ్డి. ఆల్ఫోన్స్ అభినందనలు తెలియజేశారు.






















EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com